క్లుప్తంగా

50 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

తవణంపల్లె: మండలంలోని జీసెస్ గాస్పెల్ చర్చిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చెన్నైకు చెందిన ఎంఎన్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు అబ్బాస్, అఖిల్ ఫిలిఫ్‌లు 50 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉచిత కంటి ఆపరేషన్ కోసం 20 మందిని ఎంపిక చేసి చెన్నై ఎంఎన్ హాస్పిటల్‌కు తరలించారు. కార్యక్రమంలో జీసెస్ గాస్పెల్ ప్రేయర్ మినిస్ట్రీ ట్రస్టు ప్రెసిడెంట్, పాస్టర్ ఏసు, ఎలిషా, రవి, రాజు పాల్గొన్నారు.

కమనీయం ఇంద్రవరదుని కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్రవరదుని ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. పెరటాసి నెల చివరిరోజు కావడంతో సోమవారం ఉదయం స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన మండపంలో కొలువుతీర్చి వేదమంత్రాల మధ్య స్వామివారి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

నేడు దిగువమాఘంలో ఆరోగ్య సురక్ష

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మంగళవారం ఉదయం ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

కామినాయనపల్లెలో..

ఐరాల: మండలంలోని కామినాయనపల్లె సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య నిపుణులు అన్ని రోగాలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోజుకో రూపం.. జగన్మాత దర్శనం

- అమ్మవారి ఆలయాలకు తరలి వచ్చిన భక్తజనం
- ఊరూ వాడా వైభవంగా సాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు







చిత్తూరు: చాముండేశ్వరీదేవిగా దుర్గాంబ, బంగారుపాళెం: గాయత్రీదేవిగా ముత్యాలమ్మ, యాదమరి: లక్ష్మీదేవిగా మరగదాంబికాదేవి అమ్మవారు



చిత్తూరు: బ్రహ్మచారిణిగా దుర్గాదేవి

చిత్తూరు రూరల్: నవరాత్రి ఉత్సవాలు నగరంలో సోమవారం వైభవంగా కొనసాగాయి. జగన్మాతను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల వద్దకు బారులు తీరారు. సంప్రదాయానుసారం అమ్మవార్లను తొలిరోజు వివిధ రూపాల్లో అలంకరించారు. చిత్తూరు నగరంలోని గిరింపేట శ్రీదుర్గాంబ చాముండేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు పసుపు అలంకారం, శ్రీకాశీ విశాలాక్షి అలంకారం, ముత్యాలమ్మ చాముండేశ్వరిగా, కట్టమంచిలోని శ్రీ విశ్వషిరిడీసాయిబాబా ఆలయంలో పార్వతీదేవి అలంకరణలో అమ్మవారు కనిపించారు. శ్రీకోదండ రామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారు మత్స్యావతారంలో కనువిందు చేశారు.

బ్రహ్మచారిణిగా..

నగరంలోని చర్చివీధిలో సోమవారం రాజస్థాన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో దుర్గామాతను బ్రహ్మచారిణి అలంకారంలో కొలువుదీర్చారు. ఈ అలంకరణలో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు.

చాముండేశ్వరీ అలంకరణలో..

గుడిపాల:మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. పల్లూరులోని గంగమ్మ దేవాలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం గంగమ్మను చాముండేశ్వరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కందగిరి కొండ వద్ద ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు చాముండేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

లక్ష్మీదేవి అలంకరణలో..

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని శ్రీ మరగదాంభికా దేవి నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. సాయంత్రం ఆలయ అవరణలో కుంకుమార్చన నిర్వహించి రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

పార్వతీదేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పార్వతీదేవి అలంకరణలో సింహ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

అమ్మవారి అలంకరణలో బాలిక

కాణిపాకంలో వెలసిన కాళికామాత దేవాలయంలో బాలికకు అమ్మవారిగా అలంకరించి పక్కనే కూర్చో పెట్టడం ప్రత్యేకతను సంతరించుకుంది. కాళికామాత గాయత్రీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

గాయత్రీదేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: గ్రామదేవత శ్రీముత్యాలమ్మ సోమవారం రాత్రి గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పసుపుతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో అమ్మ వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మ వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఓంశక్తి అమ్మవారి మూల విగ్రహాన్ని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



గుడిపాల: పల్లూరులో చాముండేశ్వరీదేవిగా గంగమ్మ













కాణిపాకం: గాయత్రీ దేవిగా కాళికాదేవి, బంగారుపాళెం: అన్నపూర్ణాదేవిగా వజ్రాలపురం గంగమ్మ, చిత్తూరు: మత్స్యావతరంలో కోదండరాముడు, కాశీవిశాలాక్షిగా అంకాళపరమేశ్వరి, సాయిబాబా ఆలయంలో పార్వతీదేవిగా, గుడిపాల: చాముండేశ్వరిగా దుర్గమ్మ

అరగొండలో చురుగ్గా పారిశుధ్య పనులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ, పైమాఘం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో జ్వరాలు విజృంభించడంతో పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది పారిశుధ్యం పనులు ముమ్మరం చేశారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా లార్వాలను అరికట్టేందుకు సోమవారం మందులు, ఫాగింగ్ పనులు ముమ్మరంగా చేశారు. చేయించారు. స్థానిక సర్పంచ్ మల్లుదొరై, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ ప్రశాంతకుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు చైతన్య, మహేష్ పర్యవేక్షణలో జ్వరాలు సోకిన వారికి వెంటనే వైద్య పరీక్షలు చేయించారు. గ్రామంలో జ్వరాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

చిత్తూరు రూరల్: ఇంటర్మీడియట్ అర్హతతోనే వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని వీఆర్‌ఏల సంఘం సభ్యులు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సంఘ సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీఓ నెంబరు 13 అనుసరించి ఇంటర్మీడియట్ అర్హతతో 3,795 మందికి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో వీఆర్వో నిర్లక్ష్యం

చిత్తూరు రూరల్: తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వీఆర్‌ఓను సంప్రదిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పాలసముద్రం మండలం అలివేలిమంగాపురానికి చెందిన వజ్రావేలు ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పూర్వీకుల ఆస్తిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఏడాదిగా తిరుగుతున్నానన్నారు. ఇందుకుగాను వీఆర్‌ఓ కొంత నగదు తీసుకున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే దురుసుగా ప్రవరించారని, ఇదే విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే





సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహ సారథులనుద్దేశించి ప్రసంగిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, అందుకే రాష్ట్రానికి ఆయనే మళ్లీ సీఎం కావాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వలంటీర్లు, గృహ సారథులకు దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత వచ్చిన ఎన్నికల్లో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి చంద్రబాబు నాయుడును సీఎం చేస్తే, రాష్ట్ర ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. అంతే కాకుండా పలు పథకాల పేర్లతో వారి ఖాతాల్లో నగదు జమ చేసుకొని రాష్ట్రాన్ని నట్టేట ముంచారని విమర్శించారు. జగనన్న సీఎం కాగానే నవరత్నాల ద్వారా దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కాని పథకాలు ఇక్కడ అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. అలాంటి ముఖ్యమంత్రి మనకు కావాలని తెలియజేశారు. ఎన్నికల సమయం దగ్గర పడుతోందని, ప్రతి ఒక్కరూ ప్రతి గడపకు వెళ్లి జగనన్న ఇచ్చిన పథకాలను వివరించి వారికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న కావాలని తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకూ మెరుగైన వైద్యం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన
- శిబిరంలో వృద్ధులకు కళ్లద్దాల పంపిణీ



యాదమరి: పౌష్టికాహార ప్రదర్శనలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి తెలిపారు. మండలంలోని 14 కండ్రిగ ముస్లింవాడ సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే, జెడ్పీ వైస్‌చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను వారు పరిశీలించారు. కోడిగుడ్లు మరీ చిన్నవిగా ఉన్నాయని, కాస్త పెద్దవిగా ఉండేవి తెప్పించుకోవాలని సూపర్‌వైజర్‌కు సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలకు మంచి వైద్యం అందేలా, 108, 104 వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆయన కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లోని ఇళ్ల వద్దకే వైద్యులు వచ్చి వైద్యం చేసి, మందులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ అవకాశంను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, నాయకులు కబీర్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

బంగారుపాళెం: గ్రామీణ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ వరమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని వెలుతురుచేను గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మారుమూల గ్రామాలకు సైతం వైద్యులను పంపి ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు దేశంలో ఏ ముఖ్యమంత్రీ ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టలేదన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా సీఎం అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా వృద్ధులకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిలా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్, జేఏఎస్ వైద్యులు, సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోటుకనుమలో ఆరోగ్య సురక్ష

పూతలపట్టు: రాష్ట్రంలోని పేద ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత వైద్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి కొనియాడారు. మండలంలోని పోటుకనుమ పంచాయతీలో సోమవారం సర్పంచ్ బాబునాయుడు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపును పంచాయతీ పరిధిలోని 225 మంది సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ క్యాంపు ద్వారా ప్రజలకు 7 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారులు, సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ స్థాపనే లక్ష్యం

ఐరాల: ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఐరాల సర్పంచ్ గుణవతి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 351 మందికి ప్రత్యేక నిపుణులైన వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దృష్టి లోపం ఉన్న వారికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, శరవణ శ్రీనివాస్, పావనిచంద్ర, యశ్వంత్, ఎంపీడీఓ నాగరాజు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, సీహెచ్‌ఓ సుగుణవతి తదితరులు పాల్గొన్నారు.





బంగారుపాళెం: వృద్ధులకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబు, పూతలపట్టు: రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

స్పందన వినతులకు సత్వర పరిష్కారం



యాదమరి: తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలను చుట్టుముట్టిన అర్జీదారులు

చిత్తూరు అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన వినతులపై అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి సత్వరం నివేదిక అందించాలన్నారు. ఇప్పటివరకు అందిన వినతులపై శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఇంజినీరింగ్, టీపీవో, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ, అకౌంట్స్ విభాగాలకు సంబంధించి పలు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో డా.లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి

చిత్తూరు రూరల్: స్పందన ద్వారా వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ మురళీ మోహన్ ఆదేశించారు. చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, మ్యుటేషన్, రేషన్ కార్డు తదితర సమస్యలపై 26 అర్జీలు వచ్చాయి.

అర్జీల వెల్లువ

యాదమరి: డీకేటీ భూముల రెగులైజేషన్‌కు ప్రభుత్వం అనుమతిచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు స్పందనకు భారీగా తరలివచ్చారు. డీకేటీ భూములు సాగు చేస్తూ, దానికి సంబంధించిన రికార్డులు రెవెన్యూ అధికారులకు సమర్పిస్తే వాటిని రెగులరైజ్ చేయనున్నట్లు రెవెన్యూ అధికారు తెలిపారు. దీంతో రైతులు మూడు రోజులుగా పాత రికార్డులను తీసుకొచ్చి అధికారులకు సమర్పిస్తున్నారు. దీంతో కార్యాలయం అంతా అర్జీదారులతో కిటకిటలాడుతోంది.





చిత్తూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మురళీమోహన్, ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్ అరుణ